# కంపుస్టు సమస్య తీరేదెన్నడో..!?

- కొలిక్కిరాని కంపోస్టు యార్డు వ్యవహారం
- రూ.కోట్లు వెచ్చించినా ప్రజానీకానికి తప్పని దోమల బెడద
- మెరుగపడని పారిశుధ్యం
- జనవాసాల మధ్యనే చెత్త డంపింగ్
- రోగాలు బారిన పడుతున్న జనాలు



తుని పట్టణంలోని సాయినగర్ వద్ద రైల్వే స్థలంలో పారవేసిన వ్యర్థాలు

**తుని:** రూ.కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా, పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడడం లేదు. వ్యర్థాలు, అపరిశుభ్రత కారణంగా జనాలు రోగాల బారినపడి, ఆస్పత్రుల పాలవుతూనే ఉన్నారు. ప్రజలకు మెరుగైన పరిశుభ్ర వాతావరణాన్ని కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు. ఏటా పారిశుధ్య నిర్వహణకు రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా, ఆశించిన స్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. ఎక్కడ చూసినా వ్యర్థాలు పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారాయి. అధికారంలోకి వస్తే డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామని నాయకులు హామీలివ్వడం, ఆ తర్వాత పాలకులు దానిని పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డంపింగ్ యార్డు స్థల సేకరణకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు రూ.10 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. మున్సిపల్ పాలకవర్గంలో వైఎస్సార్ సీపీ పట్టు ఉన్నా, ప్రస్తుతం ×అంతా× అధికార పార్టీ కనుసన్నల్లోనే జరుగుతోంది. అధికారంలో ఎవరున్నా, ప్రజలకు మాత్రం చెత్తాచెదారం, దోమలతో ఇబ్బందులు తప్పడం లేదు. సంపాదించిన ఆదాయంలో సింహభాగం రోగాలకు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

**ఇదీ పరిస్థితి**

తుని పట్టణంలో 30 వార్డుల్లో సుమారు 60 వేల జనాభా ఉన్నారు. ఇతర ప్రాంతాల నుంచి మరో 25 వేల మంది పట్టణానికి రాకపోకలు సాగిస్తారు. సుమారు 14 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రోజుకు దాదాపు 30 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పట్టణం నుంచి ఉత్పత్తి అవుతున్నాయి. పారిశుధ్య పనులకు 115 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. చెత్త తరలింపునకు 8 ట్రాక్టర్లు, 47 పుష్‌కార్టులు, 10 డంపర్‌బిన్లను వాడుతున్నారు. ఏటా పారిశుధ్య విభాగానికి రూ.1.95 కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నారు. పుష్కలంగా నిధులు ఖర్చు చేసినా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**దోమలకు ఆవాసాలు**

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, గుంతలు దోమలకు ఆవాసంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను పారవేస్తున్నారు. వీటిలో పందులు తిష్ట వేసి కాలుష్యాన్ని ప్రేరేపిస్తున్నాయి. కాలువల్లో పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలు టన్నుల కొద్దీ ఉంటున్నాయి. వీటిలోనే దోమలు గుడ్లు పెడుతున్నాయి. అక్కడ నుంచే దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇసుకలపేట, తారకరామానగర్, కొండవారిపేట, వీరవరపుపేట, ఆర్‌కే.కాలనీ, సాయినగర్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది. ప్రజలు దోమకాటుకు గురై, సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వాటి బారిన పడుతున్నారు.

**ఆస్పత్రుల్లో జేబులు గుల్ల**

సీజనల్ వ్యాధులు సోకిన రోగులు ఆస్పత్రులకు వెళితే జేబులు ఖాళీ అవుతున్నాయి. రక్త పరీక్ష, మందులు, వైద్యుల ఫీజు ఇలా రూ.వేలల్లో చెల్లించాల్సి వస్తోంది. పేద వర్గాల వారు ఏటా రోగాలకే సంపాదనలో సగ భాగం ఖర్చు చేస్తున్నారు. పారిశుధ్యం సక్రమంగా నిర్వహించి, దోమల నివారణకు చర్యలు తీసుకుంటే పట్టణంలో ఆరోగ్యకర పరిస్థితులు నెలకొంటాయి. దోమల నివారణకు ఏటా రూ.ఆరు లక్షల మేర పారిశుధ్యం విభాగం వారు ఖర్చు చేస్తున్నారు. ఫాగింగ్, బ్లీచింగ్ తదితర వాటిని క్రమం తప్పకుండా చేయాలి. తూతూమంత్రంగా ఆయా కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో ప్రజలకు దోమకాట్లు, రోగాలు తప్పడం లేదు. అవకాశం ఉన్న వారు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్, లిక్విడ్లు తదితర వాటికి నెలకు రూ.200 ఖర్చు చేస్తున్నారు.

**సిబ్బంది కొరత**

తుని పురపాలక సంఘంలో ఉన్న జనాభా ప్రకారం పారిశుధ్య విభాగానికి 153 సిబ్బంది అవసరం. ప్రస్తుతం 115 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎనిమిది మందిని కార్యాలయ పనుల కోసం వినియోగిస్తున్నారు. నిబంధనల మేరకు వార్డుకు ఐదుగురు కచ్చితంగా ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు కార్మికులను స్వీపింగ్, కాలువలు శుభ్రం చేయడానికి వినియోగిస్తున్నారు. ట్రాక్టర్లు, రిక్షాల విధులకు 38 మందిని కేటాయించారు. జీవో 279 ప్రకారం వర్క్‌ఫర్ అవుట్ సోర్కింగ్ విధానంలో 16 వార్డులను ప్రైవేటుకు ఇవ్వడానికి టెండర్లు పిలిచారు. 14 వార్డులు మున్సిపాలిటీ, 16 వార్డులు ప్రైవేటు సిబ్బంది పారిశుధ్య నిర్వహణ పనులు చేయనున్నారు.

### సంపాదనలో సగం రోగాలకే..



కాలువల్లో చెత్తను తీయడం లేదు. ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసాలుగా ఉన్నాయి. దోమల మందు పిచికారీ చేయడం లేదు. దోమల వలన రోగాలు సోకి సంపాదనలో సగం మందులకు ఖర్చు చేస్తున్నాం.

– డి.రత్నమాల, కొబ్బరితోట, తుని

### స్థల సేకరణకు చర్యలు



గత ప్రభుత్వ హయాంలో కంపోస్టు యార్డుకు అవసరమైన స్థల సేకరణకు ప్రతిపాదనలు పంపారు. తుని మండలం హంసవరం వద్ద డి-పట్టా భూమి కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి కోసం పంపించారు. త్వరలో భూసేకరణ పూర్తి చేస్తాం. పారిశుధ్యం విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– వెంకట్రావు, కమిషనర్, తుని

## 23న 'ఉపాధి' గ్రామ సభలు

**ప్రత్తిపాడు:** మండలంలో 2014–25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించేందుకు ఈ నెల 23న అన్ని పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు పోతులూరు, బవురువాక, లంపకలోవ, పెదశంకర్లపూడి, శరభవరం, ఉత్తరకంచి, ఒమ్మంగి, ధర్మవరం, చింతలూరు, ఏలూరు, పెద్దిపాలెం, రాచపల్లి, చినశంకర్లపూడి గ్రామాల్లో, ఉదయం 11.30కు రౌతుపాలెం, గజ్జనపూడి, ప్రత్తిపాడు, వాకపల్లి, టి రాయవరం, బురదకోట గ్రామాల్లో, సాయంత్రం 3 గంటలకు ఉద్దండ జగన్నాథపురం, వెంకట నగరం, పాండవుల పాలెం, గోకవరం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారని వివరించారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగే ఈ గ్రామసభలకు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి వేతనదారులు, ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది, సచివాలయ, గ్రామ సమాఖ్య సిబ్బంది, ప్రజలు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

**గండేపల్లి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌కు అనుగుణంగా ఉపాధి పనులు గుర్తించేందుకు ఈ నెల 23న గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఏపీఓ ఎస్.గంగాభవాని తెలిపారు. మండలంలోని 18 పంచాయతీల్లో ఒకే రోజు సభలు నిర్వహించి, వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

**తుని:** పట్టణంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, శ్రీకృష్ణజన్మాష్టమి ఊరేగింపుపై మంగళవారం హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోత సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ర్యాలీ, సమావేశాలు నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, శ్రీకృష్ణుని గొప్పతనంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సనాతన ధర్మంపై ప్రతి హిందువు గౌరవం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, విజయ్, సోమినాయుడు, శ్రీనివాసు, ఆదిబాబు, జలందర్, సత్యవతి, శాంతి, సూర్యకుమారి, సత్యవేణి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గాలికుంటు నివారణకు టీకాలు



ములగపూడిలో పశువులకు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

**రౌతులపూడి:** పశువుల్లో సంక్రమించే గాలికుంటు వ్యాధి నివారణకు పాడి రైతులు దృష్టి పెట్టాలని పశు వైద్యాధికారి డా.ఎం.వీర్రాఘవరావు అన్నారు. మంగళవారం మండలంలోని ములగపూడిలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ తమరాన సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ వీర్రాఘవరావు మాట్లాడుతూ వచ్చే నెల 18 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ములగపూడి పశువైద్యాధికారి డా.విభ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం



పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ప్రత్తిపాడు:** సమతుల్య పోషకాహారం, మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల శరీరానికి కావలసిన పోషక పదార్థాలు అందుతాయని జిల్లా రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బర్రె నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గోకవరం, మెట్టుచింత గ్రామాల్లో మంగళవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు పెరటి తోటల పెంపకంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. వ్యవసాయమే లాభసాటని ఏపీసీఎన్ఎఫ్ మెంటర్ ఎం మల్లేశ్వరి చెప్పారు. చిరుధాన్యాల సాగు, దానివల్ల సాధించే దిగుబడులు, ఆదాయం, తక్కువ పెట్టుబడితో సాగు పద్ధతులు తదితర అంశాలను వివరించారు. వంద మంది మహిళలకు 11 రకాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యవతి, ప్రత్తిపాడు మోడల్ పాయింట్ పర్సన్ మూరా చిన్నబాబు, యూనిట్ ఇన్‌చార్జి బి నాగేశ్వరరావు, యు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### దోషులను కఠినంగా శిక్షించాలి



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

**ప్రత్తిపాడు:** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై దురాగతానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ ధర్మవరం గ్రామంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామ దళిత కాలనీ వద్ద లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు ర్యాలీని ప్రారంభించారు. వైద్యులకు రక్షణ కల్పించాలని, దోషులను తక్షణం అరెస్టు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాకర రత్నకుమారి, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు అనుష లక్ష్మి, గొల్లపల్లి కామరాజు, గుడాల వెంకటలక్ష్మి, గుబ్బల సత్యవతి, పల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గోకవరం:** బంగ్లాదేశ్‌లో జరిగిన హింసను నిరసిస్తూ విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక తంటికొండ రోడ్డు నుంచి దేవీచౌక్ మీదగా శివాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై దుశ్చర్యకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వాస్పత్రికి ఆర్వో ప్లాంట్ వితరణ



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ వనజకుమారి

**గోకవరం:** రోగుల సౌకర్యార్థం గోకవరం ప్రభుత్వాస్పత్రికి దాత ఆర్వో ప్లాంట్ వితరణ చేశారు. గోకవరానికి చెందిన శ్రీలక్ష్మీసాయి జ్యూయలరీ షాప్ అధినేత పట్నాల నాగేంద్ర ఆయన తల్లి పద్మావతి జ్ఞాపకార్థం రూ.35 వేల విలువైన ఆర్వో ప్లాంట్‌ను అందజేశారు. ఈ ఆర్వో ప్లాంట్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజకుమారి మంగళవారం ప్రారంభించారు. దాతల సహకారంతో ఆస్పత్రికి పలు మౌలిక వసతులను సమకూరుస్తున్నామన్నారు. డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ రామలక్ష్మీ, హెడ్ నర్స్ లీల, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దోమల నివారణపై అవగాహన ర్యాలీ



తొండంగి మండలం ఏవీ నగరంలో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

**తొండంగి:** ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా వైద్యులు, సిబ్బంది మండలంలోని ఏవీ నగరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్, వైద్యురాలు పి.భారతి, ఇతర సిబ్బంది దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. తొండంగి, రావికంపాడు, కేపీ పురం పీహెచ్‌సీలలో కూడా వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మలేరియా యూనిట్ అధికారి మధు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**అశ్రద్ధ చేయవద్దు**

**ప్రత్తిపాడు:** దోమే కదా అని అశ్రద్ధ చేయవద్దని రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ ఆర్ పవన్‌కుమార్ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా రాచపల్లి పీహెచ్‌సీ వద్ద దోమల నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, జ్వరాలు సోకితే వెంటనే పీహెచ్‌సీలో చికిత్స పొందాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గీతా, సబ్ యూనిట్ అధికారి ఆనంద్, హెల్త్ సూపర్‌వైజర్ వీరన్న, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

**శంఖవరం:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే దోమలను నివారించవచ్చని వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యుడు ఆర్ వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

## మహిళా ఆర్థికాభ్యున్నతే లక్ష్యం



జగ్గంపేటలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దుర్గారాణి

**జగ్గంపేట:** మహిళలను సంరక్షిస్తూ, వారిని ఆర్థికంగా పరిపుష్టి చేయడం, మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం పెంచడం మిషన్ శక్తి కార్యక్రమ ప్రధానోద్దేశమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి తెలిపారు. స్థానిక శెట్టిబలిజపేట రామాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిషన్‌శక్తి అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. మిషన్ శక్తి వల్ల మహిళలు, యువతులకు ప్రయోజనాలు, సామాజిక రుగ్మతలకు గురైన వారికి చట్టపరంగా రక్షణ తదితర అంశాలను వివరించారు.

**నేడు 'ఆడపిల్లలను రక్షిద్దాం..'**

**రౌతులపూడి:** మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా అన్నవరంలో బుధవారం ఆడపిల్లను రక్షిద్దాం–ఆడపిల్లను చదివిద్దాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావది తెలిపారు. అన్నవరం సత్యగణపతి ఫంక్షన్ హాల్ వద్ద శంఖవరం, రౌతులపూడి మండలాల పరిధిలో జరిగే ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి బాల్య వివాహ నిరోధక ,పర్యవేక్షణ కమిటీ ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

## భూ సమస్యలపై ఆర్డీఓ సమీక్ష



రౌతులపూడిలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ సీతారామరావు

**రౌతులపూడి:** మండలంలోని భూ సంబంధిత సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అడంగల్, పాస్ పుస్తకాలు, గ్రామాల్లో జరిగిన సర్వేపై గ్రామాల వారీగా సమీక్షించారు. భూయజమానులు పెట్టుకున్న అర్జీలపై సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా భూసమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలోని ఉపాధ్యాయ ఓటరు నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ పీవీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్‌ను ఆదేశించారు. పలువురు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

**మెరుగైన సేవలందించండి**

**శంఖవరం:** ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పాత రికార్డు గదులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. అనంతరం నెల్లిపూడి, కొంతంగి గ్రామాల్లోని చిల్డ్రన్ హోమ్‌లను తనిఖీ చేశారు. చిల్డ్రన్ హోమ్‌లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్ పోతురాజు ఉన్నారు.

## ఘనంగా కాగితాలమ్మ తల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో కాగితాలమ్మ తల్లి

**అన్నవరం:** శ్రావణ బహుళ పాడ్యమి పర్వదినం సందర్భంగా కొత్తపేటలో ఉన్న గ్రామదేవత కాగితాలమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయానికి విచ్చేసి పొంగలి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ కాగితాలమ్మ వారిని అన్నవరం పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. గరగల నృత్యం, విచిత్ర వేషధారణలు, జానపద నృత్యాలు, తీన్‌మార్ డప్పుల మధ్య ఈ ఊరేగింపు కొనసాగింది. వందలాది మంది భక్తులు వెంట రాగా, భారీ బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

## గిరిజన తండాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పర్యటన



బురదకోట తండాలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సరిత

**ప్రత్తిపాడు:** సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని గిరిజన తండాల్లో మంగళవారం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పి.సరిత ఆకస్మికంగా పర్యటించారు. బురదకోట, కె మిర్తివాడ, ధారపల్లి తండాలను సందర్శించారు. ఆయా తండాల్లోని గిరిజనుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. బురదకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, విద్యార్థుల ఆరోగ్యంపై సూచనలిచ్చారు. బురదకోట తండాలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గృహాలను సందర్శించి, ఆరోగ్య, వైద్య సేవలను తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పురుడు పోసుకోవాలని సూచించారు. అనంతరం బురదకోటలోని ఐటీడీఏ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె యశస్వీ, ఆరోగ్య విస్తరణాధికారి నాగవాసు, హెల్త్ సూపర్‌వైజర్ రామిశెట్టి రాంబాబు, హెల్త్ అసిస్టెంట్ డేవిడ్‌రాజ్, ఆశా వర్కర్లు ఉన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



శ్రీప్రకాష్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో సినీ గాయకుడు శ్రీకృష్ణను సత్కరిస్తున్న విజయ్ ప్రకాష్



శ్రీప్రకాష్‌లో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

- సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ
- ఘనంగా శ్రీప్రకాష్ వ్యవస్థాపక వేడుకలు

**తుని:** అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించేందుకు నిరంతరం కృషి చేయాలని సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ అన్నారు. మంగళవారం శ్రీప్రకాష్ విద్యాసంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలను నిర్వహించారు. తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ముఖ్య అతిథులు సినీ గాయకుడు శ్రీకృష్ణ, కీబోర్డు ప్లేయర్ రవిశేఖర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీకృష్ణ పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. సినీ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి, సంగీత దర్శకుడు ఆర్డీ బర్మన్ పాటలను ఎంపిక చేసుకోవడం కార్యక్రమానికి వన్నె తెచ్చిందన్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థలు 48 ఏళ్లుగా నిబద్ధతతో పని చేస్తున్నాయని సీహెచ్.విజయ్ ప్రకాష్ అన్నారు. గాతా రహే మేరా దిల్ విజేతలకు విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీ నరసింహారావు, కోశాధికారి రామసీత బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథులు శ్రీకృష్ణ, రవిశేఖర్‌ను విజయ్‌ప్రకాష్ సత్కరించారు. అంతకుముందు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేని ప్రయాణం అపాయకరం

**గండేపల్లి:** ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లేని ప్రయాణం అపాయకరమని ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు అవగాహన కల్పించారు. రంగంపేట మండలం సుభద్రంపేటలో మంగళవారం వారు ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధారణ వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు. అనంతరం రహదారి భద్రతపై ప్రమాణం చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు.


## ఘనంగా రాజీవ్ జయంతి

**ప్రత్తిపాడు:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కళా మందిర్ వద్ద రాజీవ్ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు కొప్పన వెంకటేశ్వరరావు, మొయ్యేటి సూర్యప్రకాశరావు, కందిమళ్ల సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌తో భావితరాలకు ముప్పు

**జగ్గంపేట:** పర్యావరణ పరంగా ప్లాస్టిక్ వినియోగంతో భావితరాలకు ముప్పు పొంచి ఉందని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్ అధ్యక్షతన, స్థానిక వెలుగు కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ–ప్లాస్టిక్ నివారణ అనే అంశంపై సదస్సు జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎంవీవీ ప్రసాద్, వెలుగు ఏపీఎం జగదీశ్వరి, పంచాయతీ ఈఓ రాజన్‌రాజ్ పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



ఎన్.చామవరంలో చిల్డ్రన్ హోమ్‌ను పరిశీలిస్తున్న సీడీపీఓ శ్రీలత

**తుని రూరల్:** తుని మండలంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు ఆశ్రమ పాఠశాలలను ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత ఆకస్మికంగా పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల సూచనలతో ఎన్.చామవరంలో ఆశీర్వాద్ చిల్డ్రన్ హోమ్, జగన్నాథగిరిలో నాసా స్వచ్ఛంద సేవా సంస్థల్లో తనిఖీలు చేసినట్టు సీడీపీఓ శ్రీలత తెలిపారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండల కైలాసపట్నంలో శనివారం రాత్రి ఫుడ్ పాయిజన్‌తో ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడగా, మరో 35 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన జిల్లా అధికారులు ఆశ్రమ పాఠశాలల్లో వసతులు పరిశీలించాలని ఆదేశించడంతో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎన్.చామవరం ఆశ్రమంలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు చదువుతున్న ముగ్గురు బాలికలు, నలుగురు బాలురు ఉన్నారన్నారు. నాసా ఆశ్రమంలో పిల్లలు లేరన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, మంచాలు, ఫ్యాన్లు, భోజనశాలలను పరిశీలించామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

## నేటి నుంచి పరదేశమ్మ తల్లి జాతర

**తుని రూరల్:** ఎస్.అన్నవరం శివారు కొత్త సూరవరంలో ఉన్న పరదేశమ్మ అమ్మవారి 39వ జాతర మహోత్సవాలు బుధ, గురువారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. బుధవారం రాత్రి జాతర, గురువారం తీర్థం, అమ్మవారి దర్శనాలు ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని రెండు రోజుల పాటు వివిధ సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలంకరణ పూర్తయింది.

**డాక్యుమెంట్స్ పోయినవి**

**ఆకే వెంకటరమణ**

S/o. ఆకే లావరాజు,

అను నేను రాజమహేంద్రవరం లాయర్ వద్దకు వెళ్లి తిరిగి కామరాజుపేట గ్రామం మోటార్ సైకిల్ పై వస్తుండగా ఒరిజినల్ డాక్యుమెంట్ పడిపోయాయి.

దస్తావేజు నెం 2207/2009/ సర్వే నెంబర్ 148

కావున నా దస్తావేజులు దొరికిన వారు ఈ నెంబరుకు తెలియజేయగలరు.

**62817 17687**